## వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఇంద్రవెల్లి, మే 31: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అనంతపూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. 108 పైలెట్ ఆత్రం అశోక్, ఎస్ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం..ఇచ్చోడ మండలం గుండాల గ్రామానికి చెందిన హర్షద్, సల్మా దంపతుల కుమారుడు సుహాన్(13) సిరికొండ మండలంలోని తమ బంధువుల వద్ద ఉంటూ ఉర్దూ మీడియం స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. శనివారం మామ షేక్ ఆలాం రోజు మాదిరిగానే గ్రామాలకు చెందిన కిరాణ దుకాణాలకు ట్రాలీ ఆటో ద్వారా కిరాణ సరుకులు తీసుకెళ్లడంతో మామకు తోడుగా సుహాన్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇంద్రవెల్లి మండలంలోని అనంతపూర్ గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడడంతో బాలుడు సుహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆదిలాబాద్ రిమ్స్‌ను సందర్శించి సుహాన్ మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

భైంసాటౌన్, మే 31 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌కు చెందిన లారీ డ్రైవర్ నాందేవ్(39) నిర్మల్ నుంచి కంటైనర్ లారీని భైంసా వైపు తీసుకువస్తున్న క్రమంలో మాటేగాం టోల్ ప్లాజా వద్ద రోడ్డు పక్కన నిలిపి భోజనం చేసి లారీలోనే నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి కాలకృత్యాలకై లారీ దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టగా తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ ప్రొహిబిషన్ ఎస్ఐ సుప్రియ మాటేగాం వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా దవాఖానకు తరలించారు.

### మహిళ పర్సు చోరీ

భైంసా, మే 31 : నిర్మల్ జిల్లా భైంసాలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు ఎక్కుతున్న క్రమంలో ఆమె పర్సు చోరీకి గురైంది. బాధితురాలి కథనం ప్రకారం.. నిర్మల్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన తిరుమల భైంసా మండలంలోని కోతుల్‌గాంలో తన తల్లి వద్దకు వచ్చింది. శనివారం భైంసా బస్టాండ్‌కు వచ్చి నిర్మల్ బస్సులో వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని దుండగులు ఆమె పర్సు దొంగలించారు. అందులో రూ. 3 వేల నగదు, రెండు తులాల వెండి వస్తువులు ఉన్నట్లు వాపోయింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొంది.

### అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఉట్నూర్‌రూరల్, మే 31: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామంలోని ఊర చెరువులో అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందడం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన గోనె మహేశ్ (36)కు తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మానికతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కొడుకు చరణ్, కూతురు శిరీష ఉన్నారు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య తగాదాలు జరుగుతూ ఉండడంతో తిమ్మాపూర్‌లోనే పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో గొడవలు సైతం ముదిరి కొట్లాట వరకు వెళ్లినట్లు సమాచారం. శనివారం మధ్యాహ్నం సమయంలో గ్రామస్తులకు ఊర చెరువులో గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో వెలికి తీసిన పోలీసులు గోనె మహేశ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే గొడవలు జరిగిన నేపథ్యంలో మహేశ్ అనుమానాస్పద స్థితిలో మరణించడంతో ఎవరైనా హత్య చేశారా? లేక తానే ఆత్మహత్య చేసుకున్నాడా? అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

### వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

బజార్‌హత్నూర్, మే 31: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన సిడాం అర్జున్(30) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ లింబాజీ తెలిపిన వివరాల ప్రకారం..సిడాం అర్జున్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తిచెంది శనివారం ఉదయం బహిర్భుమికి అని బయటకు వెళ్లి పంట పొలాల్లో వేప చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింబాజీ తెలిపారు.

తలమడుగు, మే 31: తలమడుగు మండలంలోని భరంపూర్ గ్రామానికి సందవోయిన లస్మన్న(22) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాధిక తెలిపారు.

### ఇల్లు దగ్ధం

ఎదులాపురం, మే 31 : ఆదిలాబాద్ శాంతినగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన రేఖ ఇంట్లో నుంచి శనివారం భారీగా పొగలు రావడంతో స్థానికులు వెంటనే స్పందించి బోర్ పైపులతో నీళ్లు పోసి మంటలను ఆర్పివేశారు. ఇంట్లో భద్రపరచుకున్న నగదు, ఆమె కుమారుడు రాముకు సంబంధించిన సర్టిఫికెట్లు, సరుకులు, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. దేవుని గుడి వద్ద పెట్టిన దీపం కారణంగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఫైర్ స్టేషన్ అధికారి జయత్‌రాం తెలిపారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఎదులాపురం, మే 31 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హౌసింగ్ బోర్డ్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ పీ ప్రణయ్ కుమార్ తెలిపారు. న్యూహౌసింగ్ బోర్డ్‌కు చెందిన బిల్లు శ్రీకాంత్ ఈ నెల 29వ తేదీన హైదరాబాద్ వెళ్లి తిరిగి శనివారం వచ్చారు. ఇంటికి వేసిన తాళం తీసి వేసినట్టే ఉంది. ఇంట్లోనే ఉన్న వెండి గిన్నె, రూ.2 వేలు, చోరీకు గురైనట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### అధిక వడ్డీ వసూలు చేసిన వ్యక్తిపై కేసు

ఎదులాపురం, మే 31: ఇందిరానగర్‌కు చెందిన హేమంత్ కుమార్ మార్కెట్ యార్డ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇతను పేద ప్రజలకు అధిక వడ్డీ వసూలు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు విచారణ చేపట్టారు. అతని వద్ద 20 చెక్కులు, 21 డాక్యుమెంట్లు, 27 ప్రైమసీ నోట్ పేపర్లు, ఒకటి మోడీగేజ్ డాక్యుమెంట్ లభించాయన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు.

### నకిలీ విత్తనాలు పట్టివేత

తలమడుగు, మే 31: మండలంలోని కుచలాపూర్ గ్రామంలో బీటీ-3 నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు, వ్యవసాయాధికారులు గ్రామంలో పలు ఇండ్లలో తనిఖీలు చేశారు. కుచలాపూర్ గ్రామానికి చెందిన జక్కుల వెంకన్న ఇంటి వద్ద 25 ప్యాకెట్లు నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు వ్యవసాయ శాఖాధికారి ప్రమోద్ రెడ్డి, ఎస్ఐ రాధిక తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఆర్ఐ రోహిదాస్, ఏఈవోలు రమేశ్, సతీశ్ ఉన్నారు.

## ధైర్యమే రక్షణ మార్గం

ఎదులాపురం, మే 31 : జీవితం అనేక ఒడిదుడుకులతో కూడినది అయినప్పటికీ వాటిని ధైర్యంగా ఎదుర్కొవాల్సిన అవసరం ఉందని, ఆత్మహత్యలు ఎప్పటికి పరిష్కార మార్గం కావని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం యాపల్‌గూడ రెండవ బెటాలియన్‌లో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ నీతికపంత్(ఐపీఎస్), అసిస్టెంట్ కమాండెంట్ జయప్రకాశ్ నారాయణ హాజరయ్యారు. ఆత్మహత్యలపై రూపొందించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త స్వామి, డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, నిర్మల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఎండీ వహీద్, సభ్యుడు కుర్ర నరేశ్, ఆర్ఐ, ఆర్ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పొగాకు వాడకం మానాలి

- ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీఎం రాజ్యలక్ష్మి
- ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం పై అవగాహన



ఎదులాపురం: మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీఎం రాజ్యలక్ష్మి

ఎదులాపురం, మే 31 : పొగాకు ఉత్పతుల వాడకం వలన శరీరానికి తీరని నష్టమే కాదు, ఆర్థికంగా కూడా కుటుంబాలను దెబ్బతీస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీఎం రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. చెడు అలవాట్ల వలన ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబ శ్రేయస్సుకూ హాని కలుగుతుందన్నారు. పొగాకు కొనుగోలు చేయడానికి ఖర్చు చేసే డబ్బుతో కుటుంబానికి పండ్లు తీసుకెళ్లాలని సూచించారు. డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు ఓరల్ హెల్త్, క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. అనంతరం జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లివార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోజుకు 14 వేలకు పైగా, దేశవ్యాప్తంగా రోజుకు 3600 మంది పొగాకు సంబంధిత వ్యాధులు బలి తీస్తున్నాయి. పొగాకు వాడకాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం 2004లో కొట్ప చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత, డాక్టర్లు వినోద్, ఇఫ్ఫాత్, శ్రీనివాస్, దంత వైద్యులు షామి ఉద్దీన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీఎస్ రాజు, జిల్లా టోబాకో కంట్రోల్ సెల్ కౌన్సిలర్ శ్రీకాంత్, చిరంజీవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


నిర్మల్‌చైన్‌గేట్: ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా వైద్యాధికారి, వైద్య సిబ్బంది

### పొగాకు వాడకం వల్ల అనారోగ్య సమస్యలు

నిర్మల్ చైన్‌గేట్, మే 31 : పొగాకు వాడకం వల్ల గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. పొగాకు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారులు నయనారెడ్డి, ఆశిష్‌రెడ్డి, సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్, డీపీవో రాంచందర్, డీపీహెచ్ఎన్‌వో సాయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, మే 31 : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్మల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటరమణ, నమిత, సతీశ్, శశాంక్, అరవింద్, శ్రీకాంత్, వంశీ, నర్సయ్య, అఖిల్ పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, మే 31 : పొగాకు ఆరోగ్యానికి హానికరమని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పొగాకు రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనిర్మల్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో పారాలీగల్ వాలంటీర్లకు పొగాకు, వాటి ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో రాజలింగం, కిషన్ రావు, గంగన్న, జనార్దన్, రమేశ్ పాల్గొన్నారు.

# మోటారు సైకిళ్ల దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మున్నూరు కృష్ణ, ఎస్ఐలు

సోన్, మే 31: కొద్ది రోజుల నుంచి మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నిర్మల్ రూరల్ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.. పట్టణంలోని మోషిన్‌ఖాన్, అవిజ్‌చావుస్, మహ్మద్ సోఫియానుద్దీన్ కొద్ది రోజుల నుంచి వివిధ చోట్ల మోటారు సైకిళ్లు దొంగతనాలకు పాల్పడ్డారు. శుక్రవారం సాయంత్రం ఈడెన్ గార్డెన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వైఎస్సార్ కాలనీ నుంచి నిర్మల్‌కు వస్తున్న ఈ ముగ్గురు నిందితులు పారిపోయే ప్రయత్నం చేశారు. నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి వారిని వెంబడించి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. నిర్మల్, నిజామాబాద్ జిల్లాలో మోటారు సైకిళ్లు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి పల్సర్ బైక్‌లు, హీరో హోండాతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ మున్నూరు కృష్ణ, నిర్మల్ రూరల్, సారంగాపూర్ ఎస్ఐలు లింబాద్రి, శ్రీకాంత్, సీసీఎస్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ జానకీషర్మిల అభినందించారు.

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ఇచ్చోడ/ఉట్నూర్/ ఇంద్రవెల్లి, మే 31 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, ఉట్నూర్, ఇంద్రవెల్లిలో నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ ప్రచారజాత కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఫీజుల భారం నుంచి ఊరట పొందాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

### భరతనాట్యం ప్రాచుర్యం పొందుతుంది

ఎదులాపురం, మే 31 : హిందూ సనాతన ధర్మంలో నాటి నుంచి నేటి వరకు భరతనాట్యం ప్రాచుర్యం పొందుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం జడ్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో వెంకటేశ్వర సంగీత నాట్య అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి రామన్న హాజరయ్యారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన తిలకించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. సంగీతంలో మహేశ్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.కార్యక్రమంలో డీఈవో శ్రీనివాసరావ్, కొండయ్య దరి, విజయ్‌బాబు, వైద్యులు అబిజిత్, కళాకారులు కవిత, మహేశ్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

### పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ఉట్నూర్ రూరల్, మే 31: పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎఫ్ఆర్‌వో శీలానంద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎక్స్‌రోడ్ నుంచి ఉట్నూర్ వరకు బైక్ ర్యాలీ తీశారు.

# ప్రయాణం.. ప్రమాదకరం


ఎదురెదురుగా వస్తున్న వాహనాలు

ఆదిలాబాద్‌లోని ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పంజాబ్‌చౌక్, తాంసి బస్టాండ్, తిర్పెల్లి ప్రాంతాల్లో వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. పంజాబ్‌చౌక్ బ్యాంకు మూలమలుపు వద్ద వాహనాలను ఎదురెదురుగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నిలిపి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్, మే 31

### ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ఎదులాపురం,మే 31 : ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. దీర్ఘకాలంగా సేవలందించిన ఏఆర్ ఎస్ఐలు పీ భీంరావ్, జే గౌరయ్యలకు శనివారం ఆదిలాబాద్‌లోని పోలీసు ముఖ్య కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన అధికారులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### కురుమ సంఘం కార్యవర్గం

బోథ్, మే 31 : సొనాల మండల కురుమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కసరి చిన్నపోతన్న, ఉపాధ్యక్షుడిగా బాలే దేవన్న, ప్రధాన కార్యదర్శిగా రామాయి శంకర్, కోశాధికారులుగా దేవన్న, దేవేందర్, కార్యదర్శిగా ఊరే సంతోష్, రామాయి సదానందం, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా చంద్రకాంత్ బాబు వ్యవహరించారు.

### ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలి

దస్తురాబాద్, మే 31 : ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. భూత్కూర్ గ్రామంలో శనివారం అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు దస్తురాబాద్ మండల అంగన్‌వాడీ టీచర్లు తెలంగాణ అంగన్‌వాడీ యూనియాన్ అండ్ హెల్పర్ సంఘం(సీఐటీయూ)లో చేరారు. కార్మికుల నాలుగు లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాలని జూలై 9వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఎమ్మెల్యేకు మహిళా సంఘ సభ్యుల వినతి

నేరడిగొండ, మే 31 : మండల సమాఖ్య అదనపు గదులు, గ్రామ సంఘాల మీటింగ్ హాల్ కోసం స్థలం కేటాయించాలని మహిళా సంఘ సభ్యులు నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తప్పకుండా మహిళా సమాఖ్య సభ్యుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వనజ, సభ్యులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

సోన్, మే 31: ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని చిట్యాల్ క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణాధికారి అంబాజీ అన్నారు. తల్వేద గ్రామంలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిల్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సారంగాపూర్, మే 31 : రైతులకు నాసి రకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్, ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు. శనివారం నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లోని ఏఆర్ఎస్‌కే, హనుమాన్ ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు విక్రయించేటప్పుడు రసీదులు తీసుకోవాలని సూచించారు. మండల ఫర్టిలైజర్ యజమానులు తప్పకుండా స్టాక్ వివరాలు, ధరల పట్టికను బోర్డుపై ఉంచాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్‌లో ప్రతి రోజువారీగా రాయాలన్నారు. ఎరువులు, విత్తనాలు ఎక్కువ ధరలకు అమ్మిన, కాలం గడిచిన విత్తనాలు, పురుగుల మందులు అమ్మిన చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించార. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. వారి వెంట తహసీల్దార్ శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి వికార్ అహ్మద్ ఉన్నారు.

నిర్మల్ అర్బన్, మే 31: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల అన్నారు. నిర్మల్ జిల్లాలోని సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల్లో పోలీసులు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్ రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో విడి, నకిలీ విత్తనాలు, పురుగుల మందులు, కాలం చెల్లిన పురుగుల మందులు, విత్తనాలు ఎవరైనా అమ్మితే డయల్ 100కు కాని, 8712659599 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

దిలావర్‌పూర్, మే 31 :రైతులను మభ్య పెట్టి నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే సంబంధిత ఫర్టిలైజర్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఏజాజ్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లోని పురుగుల మందుల దుకాణాలు తనిఖీ చేశారు. ఆయన వెంట ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఏఈవోలు ఉన్నారు.

ముథోల్, మే, 31 : ముథోల్‌లోని విత్తనాల దుకాణాలను ఎస్ఐ పెర్సిస్, ఏవో రచన తనిఖీ చేశారు. బిల్ బుక్స్, లాట్ నంబర్‌తో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ నారాయణ రావు పటేల్ ఉన్నారు.

కుంటాల, మే, 31 : ప్రతి ఫర్టిలైజర్ దుకాణంలో స్టాకు డిస్‌ప్లే బోర్డు ప్రదర్శించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కమల్‌సింగ్ డీలర్లకు సూచించారు. మండలంలోని ఓలా, అంబకంటి, కుంటాలలోని ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఏవో విక్రమ్, ఎస్ఐ అశోక్ ఉన్నారు.

నర్సాపూర్(జీ), మే 31 : నర్సాపూర్(జీ)తో పాటు మండలంలోని అర్లి ఎక్స్‌రోడ్డు, చాక్‌పెల్లి, గొల్లమాడ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి రాంచందర్ నాయక్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ సాయికిరణ్ తనిఖీ చేశారు. వారి వెంట ఏఈవో గణేశ్, ఆర్ఐ సుమలత, ఫర్టిలైజర్ యజమానులు ఉన్నారు.

లక్ష్మణచాంద, మే 31: లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ ఫరిలైజర్ దుకాణాన్ని సోన్ సీఐ గోవర్ధన్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ తహసీల్దార్ సరిత, ఎస్ఐ శ్రీనివాస్, ఏవో వసంత్‌రావు ఉన్నారు.

సోన్, మే 31: నిర్మల్ మండలంలోని చిట్యాల్, కొండాపూర్, మంజులాపూర్ ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి వసంత్‌రావు, తహసీల్దార్ సంతోష్, ఎస్ఐ లింబాద్రి తనిఖీ చేశారు. వారి వెంట విత్తన డీలర్లు ఉన్నారు.

# అమాయకులను మోసగించిన భూమాఫియాపై పంజా

- ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 10 కేసులు, 9 మందిని రిమాండ్‌కు తరలింపు
- ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మే 31 : ఆదిలాబాద్ జిల్లాలో భూ అక్రమాలపై పోలీసులు దృష్టి సారించారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాలకు పాల్పడుతున్న నిందితులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని పోలీసు ముఖ్య కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లాలో భూ మాఫియా కుట్రలు తీవ్రమయ్యాయని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒక నెలలో 10 కేసులు నమోదు కాగా తొమ్మిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మే 16వ తేదీన ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మున్సిపాలిటీ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయాలని ప్రయత్నించిన మహ్మద్ అక్రమ్‌ను అరెస్టు చేసి సయ్యద్ షాబుద్దీన్‌పై కేసు నమోదు చేశామన్నారు. మే 22న ఆదిలాబాద్ టూటౌన్ పరిధిలోని మహాలక్ష్మివాడలో బాధితుడు ఆరే సుదర్శన్ ఫిర్యాదుతో నకిలీ పత్రాల ద్వారా స్థలాన్ని దక్కించుకున్న కేసులో పవార్ నవనీత్, గంద్రత్ మహేందర్‌ను అరెస్టు చేసి పడాల చేతన్ కుమార్ ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. మే 23న ఇంద్రవెల్లి మండలంలో చట్టపరమైన లొసుగులు వాడుకుని నాన్ ట్రైబ్స్‌లపై ఏజెన్సీలో ఇల్లు నిర్మించారనే నిజమైన కేసును వేసి వారి వద్ద నుంచి డబ్బులను డిమాండ్ చేసి తీసుకోవడం జరిగిందని, బాధితుడు చెంపత రావు ఫిర్యాదుతో ఏ1) గవందే బిపిన్ కుమార్ అలియాస్ విపిన్, ఏ2) మెస్రం ఆనంద్ రావ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. మే 26న ఇంద్రవెల్లి మండలంలో ఏజెన్సీ ఏరియాలో ఇల్లు నిర్మిస్తున్నారనే బాధితుని వద్ద నుంచి రూ.5 లక్షల డిమాండ్ చేసి రూ.3 లక్షలు తీసుకొని బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన కేసులో బాధితుడు మాణిక్ చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైతం బాలుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. మే 26న ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొండూరు గంగాధర్ ప్రభుత్వం ద్వారా కేటాయించబడిన ప్లాట్‌ను, అక్కడ ఇంకా దస్తావేజులు కేటాయించి, ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి తన పదవిని దుర్వినియోగం చేసిన కేసులో అరెస్టు చేశామని తెలిపారు. ఈనెల 26వ తేదీన మావల పోలీస్ స్టేషన్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి ఒకే స్థలాన్ని ఇద్దరు వ్యక్తులకు అమ్మి డబ్బులు రిజిస్ట్రేషన్ చేసి మోసం చేసిన కేసులో బాధితుడు మల్లెపూల చంద్రశేఖర్ గౌడ్ ఫిర్యాదు మేరకు నిందితుడు సజ్జారపు లక్ష్మీనారాయణను అరెస్టు చేశామన్నారు. ఈ నెల 29న ఆదిలాబాద్ రూరల్ మండలంలో కజ్జర్ల గ్రామ శివారులో 25 ఎకరాల స్థలాన్ని ఫేక్ డిపెండెంట్ సర్టిఫికెట్లను సృష్టించి కొట్టేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో తలమడుగు గ్రామ మా జీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డిని అరెస్టు చేశామన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కార్డన్‌సెర్చ్

భైంసా, మే 31 : శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. శనివారం భైంసాలోని నయాబాది ఏరియాలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 54 ద్విచక్రవాహనాలు, 8 త్రిచక్ర వాహనాలు, 2 ఫోర్ విల్లర్స్ వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ గోపీనాథ్, ఎస్ఐ గౌస్ పాల్గొన్నారు.

### నెలకొరిగిన వరి పంట పరిశీలన

ఖానాపూర్, మే 31: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని శ్రీరాంనగర్, అంబేద్కర్ నగర్, దిలావర్‌పూర్, మస్కాపూర్ గ్రామాల్లో ఇటీవల వారం రోజులపాటు కురిసిన అకాల వర్షానికి 400 ఎకరాల్లో వరి పంట నెలకొరిగింది. శనివారం ఖానాపూర్ ఏడీఏ సుజాత, ఏవో జగదీశ్వర్ పంటలను పరిశీలించారు. పంట నష్ట వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇక్కడ రైతులు పంబాల భీమేశ్వర్, శ్రీనివాస్, రమేశ్, హరీశ్, శంకర్, నవీన్, వినోద్ ఉన్నారు.

### బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత

ముథోల్, మే 31 : నిర్మల్ జిల్లా ముథోల్‌లో పీఏసీఎస్ బిద్రెల్లి నందు మండల కేంద్రానికి చెందిన సోన్‌కాంబ్లే ప్రమోద్ కుమార్, గుండోల్ల వెంకటేశ్ క్రాప్‌లోన్స్ తీసుకొని వివిధ కారణాలతో మృతి చెందారు. వారికి క్రాప్‌లోన్స్‌తో పాటు ఎల్ఐసీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులు కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, సీఈవో సాయారెడ్డి, డైరెక్టర్ గోపి పాల్గొన్నారు.

### భూమి పరిశీలన

ముథోల్, మే, 31 : నిర్మల్ జిల్లా ముథోల్‌లోని 260 సర్వే నంబరులో గల 20 గుంటల భూమిని తహసీల్దార్ శ్రీలత ఆదేశాల మేరకు పరిశీలించినట్లు ఎంపీడీవో శివకుమార్, ఆర్ఐ నారాయణ రావు పటేల్ తెలిపారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్ వెస్ట్ మేనేజ్‌మెంట్ ఈవెంట్ కొరకు ఈ భూమిని పరిశీలించినట్లు తెలిపారు. వారి వెంట సర్వేయర్ ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తాంసి, మే 31 : తాంసి(బీ) గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ హామీ ఇచ్చారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్ అన్నారు. శనివారం బోథ్ ఎమ్మెల్యేను నేరడిగొండ స్వగృహంలో మాజీ సర్పంచ్ కలిసి పలు సమస్యలు వివరించారు. గ్రామంలో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి బురద మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారని తెలపడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

### రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

బోథ్, మే 31 : రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని సొనాల తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ దుకాణా డీలర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గిర్దవార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్థికపరమైన పనులు చేపట్టాలి

బోథ్, మే 31 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆర్థికపరమైన పనులు చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవో రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ, మోటర్లకు మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, గడ్డి మందు కొనుగోలు వంటి వాటికి పంచాయతీల్లో నిధులు లేవని పేర్కొన్నారు. 2024 ఆగస్టు నుంచి పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న చెక్కులు క్లియర్ చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

### అందుబాటులో 13,64,978 పత్తి విత్తనాలు

ఎదులాపురం, మే 31: ఆదిలాబాద్ జిల్లాలో 350 విత్తన దుకాణాల్లో 13,64,978 పత్తి విత్తన సంచులు వివిధ కంపెనీలకు చెందిన హైబ్రిడ్స్ అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులు తమ సమీప డీలర్ వద్ద విధిగా రసీదు పొంది విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి నకిలీ విత్తనాల సమాచారం ఉన్న టాస్క్‌ఫోర్స్ 87126 59965, ఏడీఏ 8977742854 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

### పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోండి

నిర్మల్ అర్బన్, మే 31 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈవో రామారావు అన్నారు. శనివారం నిర్మల్‌లోని నారాయణ పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో చక్కగా అమలు పర్చాలన్నారు. శిక్షణ అనంతరం డీఈవోను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్సీలు ధర్మాజీ శశిరాజ్, రమేశ్, సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All
FINANCE
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677